## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 06-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- త్రైమాసిక వృద్ధి రేటులో 7.8 శాతం సాధించడం భారతదేశం అంతర్గత సామర్థ్యాన్ని రుజువు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులను తీర్చిదిద్దడంపై విద్యా సంస్థలు దృష్టి సారించాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కోరారు.

- దేశాన్ని 2029 నాటికి మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు స్పష్టమైన కార్యాచరణను ప్రభుత్వం సిద్ధం చేసిందని కేంద్రమంత్రి అమిత్ షా వెల్లడించారు.

- ఐక్యరాజ్యసమితి ఆమోదించిన ప్రపంచ పటానికి సంబంధించి భారతదేశ భూభాగాన్ని తప్పుగా చిత్రీకరిస్తే.. అంగీకరించే ప్రసక్తే లేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

======================

పశ్చిమాసియాలో యుద్ధం, ప్రపంచ వాణిజ్యపరమైన అడ్డంకులు ఉన్నప్పటికీ, త్రైమాసిక వృద్ధి రేటులో 7.8 శాతం సాధించడం భారతదేశ అంతర్గత సామర్థ్యాన్ని రుజువు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారతదేశాన్ని భారీ దిగుమతిదారు స్థాయి నుండి అగ్రగామి ఎగుమతిదారుగా మార్చడంలో “మేక్ ఇన్ ఇండియా” కార్యక్రమం సాధించిన విజయాన్ని ప్రధానమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. న్యూఢిల్లీలోని శ్రీ రామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరేంద్ర మోదీ ఈ సందర్భంగా మాట్లాడుతూ… స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు ఇప్పుడు 2 లక్షల 50 వేల కోట్ల రూపాయలకు పైగా ఉన్నాయని, అదే సమయంలో దేశీయ రక్షణ రంగ ఉత్పత్తి దాదాపు 2 లక్షల కోట్ల రూపాయలతో అత్యధిక స్థాయికి చేరుకుందని వెల్లడించారు. వివిధ దేశాలతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశ యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని ఆయన అన్నారు. 1925లోనే భారతదేశంలో మొదటి ఎలక్ట్రిక్ రైలు నడిచినప్పటికీ, 2014 నాటికి 30 శాతం కంటే తక్కువ రైల్వే లైన్లు మాత్రమే విద్యుదీకరణకు నోచుకున్నాయని వివరించారు. కేవలం 12 ఏళ్లలోనే కేంద్ర ప్రభుత్వం దాదాపు వంద శాతం రైల్వే లైన్ల విద్యుదీకరణ సాధించిందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులను తీర్చిదిద్దడంపై విద్యా సంస్థలు దృష్టి సారించాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కోరారు. కేవలం విద్యార్థులను వృత్తిపరమైన నైపుణ్యం సాధించేందుకు మాత్రమే పరిమితం చేయవద్దని సూచించారు. అస్సాం రాష్ట్రం గువహతిలోని గీతానగర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలలో ముఖ్య అతిథిగా ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ పురోగతికి నాణ్యమైన విద్య, పరిశోధనలతో పాటు.. వ్యక్తిత్వ వికాసం కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఉన్నత విద్యలో మహిళలు సాధిస్తున్న విజయాలను ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి, దీనిని ఒక స్వాగతించదగిన పరిణామంగా అభివర్ణిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశాన్ని 2029 నాటికి మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు స్పష్టమైన కార్యాచరణను ప్రభుత్వం సిద్ధం చేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో కలసి అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో అమిత్ షా మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల నియంత్రణకు జరిపే పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం నిర్మూలించడానికి సమగ్ర వ్యూహాన్ని అవలంబిస్తున్నట్లుగా కేంద్రమంత్రి చెప్పారు. 2029 మార్చి నాటికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న మాదకద్రవ్య రవాణా నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం, పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ భూభాగాన్ని తప్పుగా చిత్రీకరిస్తే అంగీకరించే ప్రసక్తే లేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. వివిధ దేశాలు, ఖండాల విస్తీర్ణాన్ని మరింత ఖచ్చితంగా తెలిపేలా ఐక్యరాజ్యసమితి ఆమోదించిన ప్రపంచ పటానికి సంబంధించి ఈ మేరకు భారత్ కీలక ప్రకటన చేసింది. సరికొత్త ప్రపంచ పటంలో కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లను భారత అధికారిక మ్యాప్ ప్రకారమే చూపించాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ సహా భారత సార్వభౌమ భూభాగాన్ని దేశ అధికార పటం ప్రకారమే చూపాల్సి ఉంటుందని చెప్పారు. భారత సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతపై దేశ వైఖరి దృఢమైనది.. స్థిరమైనది.. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది కాదని రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో ఒక బహుళ అంతస్తుల భవనం ఈరోజు కూలిపోయిన ఘటనలో ఒకరు మరణించగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని స్థానిక పోలీసులు తెలిపారు. ఈ భవనం 40 నుండి 50 ఏళ్ల నాటిదని, ప్రమాదం జరిగిన సమయంలో భవనం బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. ఘటనా స్థలంలో సహాయక రక్షణ చర్యల కోసం ఢిల్లీ అగ్నిమాపక శాఖ 18 అగ్నిమాపక వాహనాలను రంగంలోకి దించింది. ముందుజాగ్రత్త చర్యగా పక్కనే ఉన్న భవనాన్ని కూడా ఖాళీ చేయించామని, చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా రక్షించడానికి, బాధితుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా సామాజిక మాధ్యమం పోస్టులో తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అల్పపీడనం ప్రభావం కారణంగా రానున్న మూడు రోజుల్లో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం ఐఎండీ పేర్కొంది. అదే విధంగా పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, తమిళనాడులలో కూడా ఇదే రకమైన వాతావరణం ఉంటుందని ఐఎండీ శాస్త్రవేత్త ఉమాశంకర్ దాస్ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

చైనాలోని షెంజెన్‌లో ఈరోజు జరిగిన చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారతదేశానికి చెందిన సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. చైనాకు చెందిన హిజి టింగ్ రెన్ జియాంగ్ యు జంటపై ఫైనల్ పోరులో 11-21, 21-13, 21-17 తేడాతో విజయం సాధించిన భారత జోడీ.. చైనా మాస్టర్స్‌లో దేశానికి మొట్టమొదటి టైటిల్‌ను అందించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అంతరిక్షం, అణుశక్తితో సహా పలు వ్యూహాత్మక శాస్త్రీయ రంగాలకు ప్రైవేట్ భాగస్వామ్యం కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో రెండు రోజుల పాటు జరుగుతున్న రైజ్ కాన్‌క్లేవ్ కార్యక్రమంలో కేంద్రమంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి, శాస్త్రీయ పరిశోధనలు ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా చూడటానికి ఈ సహకారాలు అవసరమన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, అంకుర పరిశ్రమల మధ్య బలమైన సహకారం ఉండాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

స్థానిక జీవవైవిధ్యం, సాంప్రదాయ జ్ఞానాన్ని నమోదు చేయడానికి స్థానికంగానే ప్రణాళిక తప్పనిసరి అని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ కోరారు. చండీగఢ్‌లో ఈరోజు జరిగిన రాష్ట్ర జీవవైవిధ్య బోర్డులు, కేంద్రపాలిత ప్రాంతాల జీవవైవిధ్య మండళ్ల 16వ జాతీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... స్థానిక జీవవైవిధ్యం దానికి సంబంధించిన సాంప్రదాయ జ్ఞానంపైన రూపొందించిన సమగ్ర సమాచారంతో కూడిన ప్రణాళిక.. స్థానిక సుస్థిర అభివృద్ధికి దోహదపడేలా ఉండాలన్నారు. భారతదేశపు సుదీర్ఘకాల పర్యావరణ స్ఫూర్తిని ప్రస్తావిస్తూ.. మిషన్ లైఫ్, ఏక్ పెడ్ మా కే నామ్, అమృత్ సరోవర్, గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ వంటి కార్యక్రమాలను కేంద్రమంత్రి గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ నెల 8 నుండి 10వ తేదీ వరకు శ్రీలంకలో అధికారిక పర్యటన జరపనున్నారు. ఈ పర్యటనలో భాగంగా శ్రీలంక నాయకత్వంతో చర్చలు జరపడంతో పాటు.. కొలంబోలోని భారతీయ ప్రవాసులతో ఆయన సమావేశమవుతారని రక్షణ శాఖ తెలిపింది. రక్షణ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందానికి కూడా ఆయన నాయకత్వం వహిస్తారు. శ్రీలంకతో బలమైన సముద్ర రక్షణ భాగస్వామ్యంతో సహా.. పరస్పర ప్రయోజనకరమైన రంగాలలో ఇప్పటికే ఉన్న బలమైన, స్నేహపూర్వక ద్వైపాక్షిక సంబంధాలను రాజ్‌నాథ్ సింగ్ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ఆ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =